హాస్టల్‌కు పూర్వవైభవం వచ్చేనా?

- బీసీ బాలుర వసతి గృహంలో అన్ని సమస్యలే
- విద్యార్థులు లేక వెలవెల



ఉప్పునుంతల బీసీ బాలుర హాస్టల్

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు విద్యార్థులతో నిండుగా ఉండే హాస్టల్ ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతుంది. హాస్టల్‌లో సరిపడ వసతులులేక విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. దీంతో విద్యార్థులు హాస్టల్‌లో ఉండటానికి ఇష్టపడటంలేదు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నా 120 మంది విద్యార్థుల సామర్థ్యంగల హాస్టల్‌లో ప్రస్తుతం 15 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వారిలో సగం మంది విద్యార్థులు స్థానికులే కావడంతో రాత్రివేళ వారు ఇంటికి వెళ్లిపోతున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి సంబంధిత వార్డెన్‌గాని ఇతర అధికారులుగాని ఏమాత్రం పట్టించుకోవడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న వార్డెన్ వారానికి రెండుసార్లు కూడా హాస్టల్‌కు రావడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం 35 మంది వరకు ఉన్న ఈ హాస్టల్‌లో ఈ ఏడాది 20 మంది విద్యార్థులకు మించి చేరే పరిస్థితులు కూడా కన్పించడంలేదు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్ వార్డెన్‌లతో హాస్టల్‌ను నెట్టుకొస్తున్నారు. నామమాత్రంగా హాస్టల్ కొనసాగుతున్నా పాలకులుగాని, సంబంధిత అధికారులు గాని ఏమాత్రం పట్టించుకోవడలేదు. సమస్యలతోపాటు విద్యార్థుల క్రమశిక్షణపై శ్రద్ధ చూపే వారులేకపోవడంతో తమ పిల్లలను హాస్టల్‌లో చదివించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటంలేదు. చాలా మంది విద్యార్థులు నిత్యం పరిసర గ్రామాల నుంచి ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చి వెళ్తున్నారే తప్పా హాస్టల్‌లో ఉండటానికి సుముఖత చూపడంలేదు.

ముందుకు సాగని చదువులు..

దాదాపుగా పదిహేను ఏళ్ల కిందట నిర్మించిన ఈ హాస్టల్ భవనంలో తలుపులు, కిటికీలు సరిగాలేవు, చలికాలంలో విద్యార్థులు కిటికీలకు బట్టలు అడ్డుగా కడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతోపాటు స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. హాస్టల్ స్నానపు గదులు, మరుగుదొడ్లు ఇళ్లకు అనుసరించి ఉండటం, ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. బాత్‌రూంలు సరిగాలేక కొంతమంది ఆరుబయటనే స్నానాలు చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కంపు వాసనను తట్టుకోలేకపోతున్నామని సమీపంలో ఉన్న ఇళ్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరీ లేకపోవడంతో..

హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం పెద్ద సమస్యగా మారింది. కొద్దిమంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండకుండ బయట తిరగడం, రాత్రిళ్లు గ్రామానికి చెందిన విద్యార్థుల ఇళ్లలో పడుకోవడం వంటి వాటితో విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు కనీసం పాఠశాలకు వెళ్తున్నారా. లేదా అనే విషయాన్ని కూడా చూసే వారు లేరు. పలుమార్లు అధికారులు రాత్రిళ్లు హాస్టల్‌లో బసచేసి సమస్యలను దగ్గరగా ఉండి చూసినా ఇప్పటివరకు ఏ ఒక్క పని చేపట్టి సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. హాస్టల్‌కు సంబంధించిన స్థలంలో పిచ్చి చెట్లు, గడ్డి పెరగడంతో పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. దీంతో తేళ్లు, పాములు హాస్టల్ పరిసర ప్రాంతంలో తిరిగే పరిస్థితి ఏర్పడింది. రాత్రివేళ విద్యార్థులు బాత్‌రూంకు వెళ్లాలన్నా భయపడుతున్నారు.



తలుపులేని స్నానపు గదులు, మరుగుదొడ్లు



హాస్టల్‌లో తలుపు ముందు బండరాళ్లు

సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో సమస్యలు పరిష్కరిస్తే చదువుకోవడాని కి మంచి వాతావరణం ఏర్పడుతుంది. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు, మేకలు, పందులు హాస్టల్ ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రహరీ నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేయాలి. బాత్‌రూంలు సరిగా లేవు. సౌకర్యాలు లేకపోవడంతో హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడటం లేదు.

– కె. శివశేషు, 10 తరగతి, హాస్టల్ విద్యార్థి

మరమ్మతు చేయించాలి



కొన్నేళ్లుగా నిర్వహణ లేక హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతు చేయించి కొత్తగా తలుపులు, కిటికీలు అమర్చి రంగులు వేయించాలి. గడ్డి, పిచ్చిమొక్కలతో హాస్టల్ పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. పక్కనే ఇళ్లు ఉండటం, ప్రహరీ లేకపోవడంతో స్నానాలు చేయడానికి ఇబ్బందిగా ఉంది.

– శ్రీకాంత్, 9వ తరగతి, హాస్టల్ విద్యార్థి

అదనపు బాధ్యతలతో ఇబ్బందులు

ప్రస్తుతం పాలెం బీసీ హాస్టల్ వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. అదనంగా ఉప్పునుంతల బీసీ హాస్టల్ బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు పూర్తిస్థాయిలో నిర్వర్తించలేకపోతున్నా. రెండు హాస్టళ్ల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో వెళ్లలేకపోతున్నా. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఉప్పునుంతలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. హాస్టల్‌లో విద్యార్థులు ఉండటానికి ఇష్టపడటంలేదు.

– జయశంకర్, ఇన్‌చార్జ్ వార్డెన్, ఉప్పునుంతల

క్లుప్తంగా

'రాజీవ్ యువ వికాస్' అమలు చేయాలి

కొల్లాపూర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సోమశిలలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు దరఖాస్తులు తీసుకోవడం తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. వెంటనే నిరుద్యోగులకు యూనిట్ల వారిగా నిధులు మంజూరు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

కొల్లాపూర్ రూరల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి ఇమ్మాన్యుయేలు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సెయింట్ మేరీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు వేయాలని కమిషనర్‌కు వినతి



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు రోడ్డు వేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం బంగారుబాబు మాట్లాడుతూ కళాశాలకు వెళ్లే దారిలో రోడ్డు గంతలమయంగా మారిందని వివరించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్‌కుమార్, కళాశాల అధ్యక్షుడు శివ, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని కొన్ని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో డీఈఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఐఐటీ, ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వివరించారు. పట్టణంలోని ఓ స్కూల్ భవనం కూడా బఫర్ జోన్‌లో ఉందని తెలిపారు. విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, నవీన్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు సరికాదు

తాడూరు: దళితులపై దాడులను అరికట్టాలని సీపీఐ నాయకులు భరత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనం నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో అరవింద్, కిషోర్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై చెంచులకు అవగాహన

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చెంచు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దాపూర్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మల్లేష్ కోరారు. శనివారం మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన మన్నెవారిపల్లి, దేవులతండాలో ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్(పీఎం జుగా)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గిరిజనలందరూ ఆధార్, కుల, జనన, బ్యాంకు ఖాతా తదితర ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

మహిళ మృతిపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని యెన్నమ్స్ ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ మృతి చెందిన ఘటనపై శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. మండలం చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్లెటి పద్మ శుక్రవారం రాత్రి నడుచుకుంటు కల్వకుర్తి నుంచి వెల్దండ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో యెన్నమ్స్ ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్త లింగయ్యతో పాటు కుమార్తె ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

కొల్లాపూర్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం నాటికి నాలుగో రోజు కొనసాగింది. పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్న వారికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌ఎండీ ఫయాజ్ మద్దతు ఇచ్చారు. అదే విధంగా ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా నాయకులు సంఘీభావం తెలిపారు. అంతకుముందు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు స్వేచ్ఛ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇందిరా, శివుడు, మామిడి చెట్టు వెంకటస్వామి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

స్వామి వారికి వెండి శంఖం బహూకరణ



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన లక్ష్మీనర్సింహస్వామికి రూ.40 వేల విలువ చేసే వెండి శంఖంను శనివారం పోలేపల్లి స్వరూప, శేఖర్‌రెడ్డి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీనివాస్‌యాదవ్

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌యాదవ్ యాదవ మహాసభ రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్‌గా ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్‌యాదవ్‌లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం నాయకులు గోర్ల యశ్వంత్‌యాదవ్, వినోద్ కుమార్ యాదవ్ ఉన్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

కల్వకుర్తి రూరల్: యువత స్వయం ఉపాధిలో రాణించాలని మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడుమ ఉమాపతి కోరారు. శనివారం పట్టణంలో మిక్కీ జిల్లా అధ్యక్షుడు దుబ్బ నాగేష్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజన్న, రాజేందర్, శేఖర్, ప్రసాద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి

పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా వైద్య సిబ్బంది వారిని చైతన్యం చేస్తూ అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. శనివారం మండలంలోని గోప్లాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలపై ఆరా తీశారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, గర్భిణులు సకాలంలో వ్యాక్సిన్ తీసుకోవడంతో వ్యాధుల బారిన పడకుండా అరికట్టవచ్చన్నారు. సిబ్బంది నర్సమ్మ, నాగేశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ప్రజాపాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్: ప్రజల ఆశీర్వాదంతోనే ప్రజా పాలన కొనసాగుతుందని స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా అన్ని స్థానాల్లో గెలుపొందుతామని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం అమ్రాబాద్ ఎంకే ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అమ్రాబాద్, పదర రెండు క్లీన్‌స్వీప్ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలన్నారు. రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు భరోసా పథకాలపై అవగాహన కల్పించాలని వివరించారు. అనంతరం అమ్రాబాద్ రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, తిరుమలయ్య, వెంకటయ్య, కైరత్, రహీం, రాజరాం గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మన్ననూర్: గ్రామానికి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల సురేష్, మాజీ ఎంపీటీసీలు ఎంఏ రహీం, శ్రీనువాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, శివాజీ, సెవ్వ బాలు, వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు




వెల్దండ మండలం పోషమ్మగడ్డతండాలో భూమిపూజ చేస్తున్న డీఎల్‌పీఓ నర్సిరెడ్డి

వెల్దండ: ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని డీఎల్‌పీఓ నర్సిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోషమ్మగడ్డతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు 400చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించొద్దన్నారు. ఇళ్లు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండో విడతలో మంజూరు అవుతాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పంతునాయక్, కార్యదర్శి నవనీత తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపీడీఓ ఆంజనేయులు భూమి చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి రోజు మండల స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మండల కేంద్రంలోని కస్తూర్బాలో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి దమయంతి

ఉప్పునుంతల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తహసీల్దార్ పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యవసర సరకుల స్టాక్‌ను ఆమె తనిఖీ చేశారు. తాజా కూరగాయాలతో వంట చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజీబీవీ స్పెషలాఫీసర్ సైదా, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

లింగాల: మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని ప్రత్యేకాధికారి దమయంతి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని వంట గదిని, తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు వండాలని సూచించారు. విద్యార్థినులకు తరచుగా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ఎస్‌ఓ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఏఓ తనిఖీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదిని, వంట సరుకులు, స్టోర్ రూంను పరిశీలించారు. వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కరపత్రాల విడుదల

కోడేరు: వచ్చేనెల 13, 14వ తేదిల్లో గద్వాలలో నిర్వహించే మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో అవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం విడుదల చేశారు. మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ముస్లింల సంక్షేమం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో వలీ, మాలిక్, యాహియా, మక్బుల్, షఫీ, పాషా,రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

తిమ్మాజిపేట: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముడావత్ మిట్టు డిస్కస్ త్రోలో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం ఎంఈఓ సత్యనారాయణశెట్టి పాఠశాలలో విద్యార్థి మిట్టును సన్మానించారు. హనుమకొండలో 10వ తరగతి చదివేందుకు సీటు సాధించడంపై అభినందించాడు. కార్యక్రమంలో పాఠశాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కోడేరు: రాజీవ్ యువ వికాస పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మధు, రవి, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దళిత లైన్‌మెన్‌పై దాడి అమానుషం

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో నెల్లికొండ గ్రామానికి చెందిన దళిత లైన్‌మెన్ మల్లేష్‌పై కొందరు కులం పేరుతో దూషించి దాడి చేయడం అమానుషమని అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ గూటం విజయ్, శివప్రసాద్, అంతటి కాశన్నలు పేర్కొన్నారు. శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లేష్ పరామర్శించారు. దాడి చేసిన నెల్లికొండ రామన్‌గౌడ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, బోనాసి రాములు ఏసయ్య, అంతటి తిరుపతయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేయొద్దు

కోడేరు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింహ, రవి, మాలిక్, రాజేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

లింగాల: పంటలను సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ల నివారణ తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ పేర్కొన్నారు. మండలంలోని మగ్దూంపూర్ శివారులో శనివారం ఓ వ్యవసాయ పొలంలో క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంట విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా విత్తన శుద్ధిని చేయించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్‌కుమార్, రైతులు బాల్క శ్రీను, కురుమూర్తి, లక్ష్మయ్య, ఉమ్లా, వెంకటేష్, శివశంకర్, శేఖర్, లక్ష్మమ్మ, జయమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు సీడీఎఫ్ నిధుల ద్వారా రూ.25లక్షలు మంజూరు అయినట్లు మండల మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

తిమ్మాజిపేట: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. 18 నెలలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపీగౌడ్, నాయకులు ఆయూబ్‌ఖాన్, స్వామి, వెంకటేష్, నర్వరఘు, ప్రశాంత్, సైఫ్, పాండు, సలావుద్దీన్, రాములు, పలు గ్రామాల యువకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలి

చారకొండ: డీఎల్‌ఐ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న మండలంలోని గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని ముంపు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎర్రవల్లి, ఎర్రవల్లి తండావాసుల విలేకరులతో మాట్లాడారు. ముంపునకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



అచ్చంపేట రూరల్: లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ కోరారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేశ్యానాయక్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పార్వతమ్మ, భారతి, చంద్రకళ, జయ, చంద్రకళ, సంతోషి, విజయ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పెంట్లవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షురాలు శ్యామల కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశానికి కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎలేని సుధాకర్‌రావుతో కలిసి ఆమె హాజరయ్యారు. 11 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భద్రత బీజేపీతోనే సాధ్యమన్నారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు జైసింహకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, శేకర్‌గౌడ్, ప్రసాద్, కంటి వెంకటస్వామి, కురుమూర్తి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆషాడ మాసం సందర్భంగా శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మహిళలు స్వయంగా గోరింటాకును తెచ్చి సిద్ధం చేసుకున్నారు. ఒకరికొకరు గోరింటాకు చేతులకు పెట్టుకొని సంబురపడ్డారు. గోరింటాకు విశిష్టతను పలువురు వివరించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో శనివారం అంజనీమాత ఆధ్వర్యంలో సామూహికంగా గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. గౌరీదేవి అంశ అయిన గోరింటాకును ఆషాడమాసంలో పెట్టుకోవడం ఆచారంగా వస్తుందని అంజనీమాత సేవాసమితి అధ్యక్షురాలు రాజపుత్ర సునీతబాయి తెలిపారు. కార్యక్రమంలో మహిళలు హేమలత, సంగీతాబాయి, శకుంతల, లక్ష్మీబాయి, కృష్ణవేణి, చంద్రకళ, మంగమ్మ, దుర్గాబాయి, కవిత, వరలక్ష్మి, లతారెడ్డి, నారాయణమ్మ, గంగాబాయి పాల్గొన్నారు.

పారిశ్రామికంగా తీర్చిదిద్దాలి

కొల్లాపూర్ రూరల్: నియోజక వర్గాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌ఎండీ ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఇందిరమ్మ, శివుడు, కిరణ్ కుమార్, వెంకటస్వామి, యూసుఫ్, జంగం శివుడు, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

నాగర్‌కర్నూల్	జె. సంపత్ కుమార్	- 88865 67081
కొల్లాపూర్	వై. కురుమూర్తి	- 79979 58205
అచ్చంపేట/కల్వకుర్తి	యం. విజయ్	- 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

పి. మధుసూదన్ గౌడ్ : 90100 06785